ఎన్నికల వేళ విపక్ష నేతల అరెస్టా?

- కేంద్ర దర్యాప్తు సంస్థలది ఉద్దేశపూర్వక చర్యే!
- కేంద్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ఈసీ నియంత్రించాలి
- లేకపోతే ఎన్నికల ప్రక్రియలో గందరగోళం తలెత్తొచ్చు
- ఈసీకి లేఖ రాసిన 87మంది మాజీ బ్యూరోక్రాట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: లోక్‌సభ ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీలు, నేతలే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థలు చర్యలకు దిగుతుండటాన్ని మాజీ బ్యూరోక్రాట్లు ఆక్షేపించారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి వారు గురువారం లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న ప్రస్తుత సమయంలో విపక్షాలకు చెందిన సీనియర్ నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేయడం ఉద్దేశ్వపూర్వక చర్యగా తమకు తోస్తున్నదని పేర్కొన్నారు. అవినీతిపై చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు సంస్థలకు ఉన్న అధికారాన్ని తాము ప్రశ్నించడం లేదని, నేతలను అరెస్ట్ చేసిన సమయాన్నే తాము ప్రశ్నిస్తున్నామని చెప్పారు. ఎన్నికల వేళ రాష్ట్రాల్లో ప్రభుత్వ యంత్రాంగాన్ని నియంత్రణలోకి తీసుకుంటున్నట్టుగానే కేంద్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా నియంత్రణలోకి తీసుకోవాలని ఈసీని కోరారు. లేకపోతే ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ప్రతీకార రాజకీయాలు చేస్తున్నప్పుడు మౌనంగా ఉంటున్నదనే అపవాదు ఎదుర్కోవాల్సి వస్తుందని లేఖలో పేర్కొన్నారు. కాన్‌స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూప్(సీసీజీ) తరఫున వజాహత్ హబీబుల్లా, ఏఎస్ దులత్, శివశంకర్ మీనన్, జీకే పిళ్లై, మీరన్ సీ బోర్వాంకర్, కే సుజాతారావు, జూలియో రిబీరో, మాక్స్‌వెల్ పీరా, వప్పాల బాలచంద్రన్ సహా 87 మంది మాజీ బ్యూరోక్రాట్లు ఈ లేఖపై సంతకాలు చేశారు.

చర్యలు తీసుకోకపోతే గందరగోళమే

లోక్‌సభ ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతలపై సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలు వ్యవహరిస్తున్న తీరును మాజీ బ్యూరోక్రాట్లు ఈ లేఖలో ప్రస్తావించారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, టీఎంసీ మహువా మొయిత్రా ఆస్తులపై సోదాలు, కాంగ్రెస్‌పై ఐటీ దాడులు తదితర చర్యలను పేర్కొన్నారు. ఎన్నికల ముంగిట అరెస్టులు చేయడాన్ని ప్రస్తావిస్తూ.. ఫలితాలు వచ్చాక ఆ పనిచేస్తే వచ్చే నష్టమేంటని లేఖలో ప్రశ్నించారు. ఈ విషయంలో ఈసీ తక్షణ చర్యలు తీసుకోకపోవడంపై తామంతా ఆందోళనగా ఉన్నామని తెలిపారు. ఆర్టికల్ 324 కింద ఎన్నికల కమిషన్ తన అధికారాలను ఉపయోగించాలని, కేంద్ర అధికార యంత్రాంగాన్ని నియంత్రణలోకి తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కేంద్రంలోని చట్టాన్ని అమలు చేసే సంస్థల కార్యకలాపాలను ఈసీ నియంత్రించాలని కోరారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వాల్లోని చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా కేంద్ర సంస్థల్లానే వ్యవహరిస్తే అరాచకానికి దారితీయొచ్చని, ఎన్నికల ప్రక్రియనే గందరగోళంగా మారుతుందని వారు హెచ్చరించారు.

స్కాన్ చేయండి.. స్కామ్‌లు చూడండి

- బీజేపీకి వ్యతిరేకంగా తమిళనాట పోస్టర్లు

చెన్నై: తమిళనాడులో బీజేపీకి వ్యతిరేకంగా లక్షలాది పోస్టర్లు వెలిశాయి. లోక్‌సభ మొదటి దశ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇవి సంచలనం సృష్టిస్తున్నాయి. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ అవినీతిని ఎండగడుతూ ఈ పోస్టర్లు వెలిశాయి. పోస్టర్లపై జై పే అని ముద్రించారు. స్కాన్ చేయండి.. స్కామ్‌లు చూడండి అని కింద ఒక ట్యాగ్ లైన్ కూడా జత చేశారు. ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే యూజర్లకు ఓ వీడియో కనిపిస్తుంది. అందులో కేంద్రంపై అవినీతి ఆరోపణలను ఎక్కుపెడుతూ ఓ వాయిస్ వినిపిస్తుంది. ఎన్నికల బాండ్లు మొదలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతితో సహా కొంత మంది పారిశ్రామిక వేత్తలకు బీజేపీ ప్రభుత్వం కోట్ల రూపాయల రుణ మాఫీ చేసిన అంశాలన్నీ వాయిస్ రూపంలో ఉన్నాయి. ఈ పోస్టర్లను డీఎంకే ముద్రించిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిరుద్యోగం.. ధరల మోత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశంలో నిరుద్యోగ సమస్య, విపరీతంగా పెరుగుతున్న ధరల ప్రభావం రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కనిపించబోతున్నదా? బీజేపీ విజయావకాశాలపై ఈ రెండు అంశాలు గట్టిగానే దెబ్బతీస్తాయా? అంటే అవుననే అంటున్నది సీఎస్‌డీఎస్ – లోక్‌నీతి సర్వే. 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశ ప్రజల మనోగతాన్ని గుర్తించేందుకు సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవెలపింగ్ సొసైటీస్(సీఎస్‌డీఎస్) – లోక్‌నీతి సంస్థ ప్రీ పోల్ సర్వే నిర్వహించింది. 19 రాష్ట్రాల్లోని 100 లోక్‌సభ నియోజకవర్గాల్లో సర్వే చేసి 10,019 మంది అభిప్రాయాలను సేకరించింది.

ఈ రెండు అంశాల ఆధారంగానే ఓటేస్తాం

- ప్రతి ఇద్దరు ఓటర్లలో ఒకరి మాట ఇదే
- సీఎస్‌డీఎస్ - లోక్‌నీతి సర్వేలో వెల్లడి
- రామమందిర నిర్మాణ ప్రభావం స్వల్పమే
- అవినీతి పెరిగిందన్న 55 శాతం మంది

గత ఐదేండ్లలో అభివృద్ధి ఎలా జరిగింది ?

ధనికులకే పరిమితమైంది	అందరికీ అందింది	అసలు జరగలేదు
32 శాతం	48 శాతం	15 శాతం

గత ఐదేండ్లలో అవినీతి ఎలా ఉంది?

పెరిగింది	అలాగే కొనసాగుతున్నది	తగ్గింది
55 శాతం	19 శాతం	19 శాతం

రైతుల ఆందోళనపై మీ అభిప్రాయమేంటి?

రైతుల డిమాండ్లు న్యాయమైనవి, వారికి నిరసనలు తెలిపే హక్కుంది	రైతుల ఆందోళనలు కేంద్రప్రభుత్వంపై కుట్ర
59 శాతం	16 శాతం

రైతుల ఆందోళనలు, డిమాండ్ల గురించి తెలియదు 11 శాతం

ప్రభావం చూపేది బీజేపీపైనే ?!

లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఏ అంశాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారని ఓటర్లను అడగగా.. నిరుద్యోగ అంశాన్ని తీసుకొంటామని 27 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడ్డారు. ధరల పెరుగుదల అంశం ముఖ్యమైనదని 23 శాతం మంది పేర్కొన్నారు. అంటే, మొత్తం ఓటర్లలో 50 శాతం మంది ఈ రెండు అంశాల ఆధారంగానే ఓటు వేయబోతున్నారని ఈ సర్వే పేర్కొన్నది. పదేండ్లుగా కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నందున నిరుద్యోగం, ధరల పెరుగుదల అంశాల్లో ఓటర్ల అసంతృప్తి బీజేపీకి ఇబ్బందికరంగా మారవచ్చు. ధరల పెరుగుదలకు కేంద్రమే కారణమని 26 శాతం మంది భావిస్తుండగా, 12 శాతం మంది మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలే కారణంగా చెప్తున్నారు. 56 శాతం మంది రెండూ కారణమంటున్నారు.

రామమందిర నిర్మాణం ఓట్లు రాల్చదా?

అభివృద్ధిని ప్రధాన అంశంగా పరిగణించి ఓటు వేస్తామని 13 శాతం మంది అభిప్రాయపడ్డారు. గత ఐదేండ్లలో అభివృద్ధి ఎలా జరిగిందని అడిగిన ప్రశ్నకు.. 32 శాతం మంది కేవలం ధనికులకే పరిమితమైందని చెప్పగా, 48 శాతం మంది అందరికీ అభివృద్ధి ఫలాలు అందాయని అభిప్రాయపడ్డారు. 15 శాతం మంది మాత్రం అసలు అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ఇక, ఎనిమిది శాతం మంది అవినీతి అంశాన్ని పరిగణనలోకి తీసుకొని ఓటు వేస్తామని చెప్పారు. గత ఐదేండ్లలో అవినీతి పెరిగిందా? తగ్గిందా? అని అడిగిన ప్రశ్నకు 55 శాతం మంది పెరిగిందని, 19 శాతం మంది యథాతథంగా ఉందని, 19 శాతం మంది మాత్రం అవినీతి తగ్గిందని చెప్పారు. తమకు ఓట్లు కురిపిస్తుందని బీజేపీ ఎంతగానో ఆశలు పెట్టుకున్న అయోధ్యలో రామమందిర నిర్మాణం అంశాన్ని ఓటు వేయడానికి ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటామని కేవలం 8 శాతం మంది మాత్రమే చెప్పారు. హిందుత్వ అంశం ఆధారంగా ఓటు వేస్తామని రెండు శాతం మంది, అంతర్జాతీయంగా భారత్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ఓటు వేస్తామని రెండు శాతం మంది అభిప్రాయపడ్డారు.

కర్ణాటక కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయం

లోక్‌సభ బరిలో ఆరుగురు మంత్రుల పిల్లలు

బెంగళూరు, ఏప్రిల్ 11: కర్ణాటక కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయాలు పెరిగిపోయాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆరుగురు మంత్రుల కుమారులు, కుమార్తెలు బరిలో నిలిచారు. వీరితోపాటు మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ సతీమణి ప్రభా మల్లికార్జున్ కూడా పోటీచేస్తున్నారు. వాస్తవానికి పలువురు మంత్రులను లోక్‌సభ బరిలో నిలపాలని కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నిస్తుంది. అయితే మంత్రులు అందుకు ససేమిరా అనడంతో వారి కుటుంబ సభ్యులను పార్టీ బరిలోకి దింపింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో కాంగ్రెస్‌కు కేవలం ఒక్క సీటు మాత్రమే దక్కింది. రాబోయే ఎన్నికల్లో 15 నుంచి 20 సీట్లు సాధించాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నది. రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలకు ఏప్రిల్ 26, మే7న మొత్తం రెండు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

బరిలో నిలిచింది వీరే..

మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ కొడుకు మృణాల్ రవీంద్ర హెబ్బాల్కర్ బెల్గాం నుంచి పోటీ పడుతున్నారు. అలాగే ఈశ్వర్ ఖండ్రే కుమారుడు సాగర్ ఖండ్రే బీదర్ నుంచి పోటీ చేస్తుండగా.. హెచ్‌సీ మహదేవప్ప కుమారుడు సునీల్ బోస్ చామరాజ నగర్ నుంచి పోటీ పడుతున్నారు. అలాగే సతీశ్ జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి చిక్కోడి నుంచి, శివానంద పాటిల్ కుమార్తె సంయుక్త పాటిల్ బాగల్ కోట్ నుంచి, రామలింగారెడ్డి కూతురు సౌమ్యారెడ్డి బెంగళూరు సౌత్ నుంచి బరిలో నిలిచారు. ఇక మరో మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ భార్య, సీనియర్ నేత శామనూరు శివశంకరప్ప కోడలు అయిన ప్రభా మల్లికార్జున్ దావణగెరె నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డికి మినహా మిగిలిన ఎంపీ అభ్యర్థులెవరికీ రాజకీయ అనుభవం లేదు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి.. కలబుర్గి (గుల్బర్గా) నుంచి పోటీ చేస్తున్నారు. కర్ణాటక కాంగ్రెస్ చీఫ్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన సోదరుడు డీకే సురేశ్‌ను బెంగళూరు రూరల్ నుంచి పోటీకి నిలబెట్టారు. ఇతనికి ప్రత్యర్థిగా మాజీ ప్రధాని దేవగౌడ అల్లుడు, ప్రముఖ కార్డియాలజిస్ట్‌ను బీజేపీ, జేడీ(ఎస్) సంయుక్త అభ్యర్థిగా రంగంలోకి దింపాయి.

ఇండియా కూటమి గెలిస్తే మోదీ జైలుకే

లాలూ కూతురు మీసా భారతి

పట్నా, ఏప్రిల్ 11: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రధాని నరేంద్ర మోదీ మొదలుకొని బీజేపీ నేతలంతా జైలులో ఉంటారని ఆర్జేడీ నాయకురాలు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు మీసా భారతి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ముస్లిం లీగ్‌తో ప్రధాని మోదీ పోల్చడాన్ని తిప్పికొడుతూ మీసా భారతి ఈ వ్యాఖ్యలు చేశారు. 'మోదీ వీటిని బుజ్జగింపు రాజకీయాలుగా చూస్తున్నారా? బీహార్‌కు వచ్చినప్పుడల్లా మా కుటుంబానిపై ఆయన అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. దేశ ప్రజలు ఇండియా కూటమికి అవకాశమిస్తే మోదీ మొదలుకొని బీజేపీ నేతలంతా జైల్లో ఉంటారు' అని ఆమె అన్నారు.

పంజాబ్ లోక్‌సభ బరిలో

ఇందిర హంతకుడి కుమారుడు

అమృత్‌సర్, ఏప్రిల్ 11: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హంతకుల్లో ఒకడైన బీంట్‌సింగ్ కుమారుడు సరబ్‌జీత్‌సింగ్ ఖల్సా (45) లోక్‌సభ ఎన్నికల బరిలో దిగారు. ఇంటర్ డ్రాపౌట్ అయిన ఆయన ఫరీద్‌కోట్ (రిజర్వుడు) స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేస్తున్నారు. గతంలో ఆయన 2014లో ఫతేగఢ్ సాహిబ్ (రిజర్వుడు) స్థానం నుంచి, 2019లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థిగా బటిండా నుంచి పోటీచేసి రెండుసార్లూ ఓటమి పాలయ్యారు. 2014 ఎన్నికల్లో సరబ్‌జీత్‌సింగ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులను రూ. 3.5 కోట్లుగా పేర్కొన్నారు.

కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శిపై వేటు

విధుల నుంచి తొలగింపు

న్యూఢిల్లీ : మద్యం పాలసీ కేసులో ఇప్పటికే అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆయన వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్‌ను ఢిల్లీ విజిలెన్స్ శాఖ విధుల నుంచి తొలగించింది. 2007లో అతనిపై ఉన్న కేసును పేర్కొంటూ, నియామక ప్రక్రియలో నిబంధలను పాటించలేదని, అతడిని తక్షణం విధుల నుంచి తప్పిస్తున్నట్టు విజిలెన్స్ ప్రత్యేక కార్యదర్శి వైవీవీజె రాజశేఖర్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విధులు నిర్వహించకుండా అడ్డుపడటమే కాక, తనను దూషించాడంటూ మహేష్ పాల్ అనే ప్రభుత్వ ఉద్యోగి 2007లో సెక్టార్ 20 నోయిడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జార్ఖండ్‌లో 15 మంది నక్సల్స్ లొంగుబాటు

రాంచీ, ఏప్రిల్ 11: ఎన్నికలకు ముందు జార్ఖండ్‌లో భద్రతా దళాలు గొప్ప విజయాన్ని సాధించాయి. ఒక మైనర్, ఇద్దరు మహిళలు సహా కరుడుగట్టిన రెడ్ రెబెల్ మిసిర్ బెస్రా దళానికి చెందిన 15 మంది నక్సల్స్ తమ ఆయుధాలను వదిలి గురువారం పోలీసుల ముందు లొంగిపోయారు. మావోయిస్టుల డెన్ అయిన సింగ్‌భూమ్‌లోని పలు మారుమూల ప్రాంతాల్లో చాలా దశాబ్దాల తర్వాత తొలిసారిగా మే 13న ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వీరి లొంగుబాటు పోలీసుల విజయంగా అధికారులు భావిస్తున్నారు.

ఆర్టీఐ కింద బాండ్ల వివరాలు ఇచ్చేందుకు ఎస్బీఐ నిరాకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ఎన్నికల కమిషన్‌కు (ఈసీ) అందజేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఇచ్చేందుకు ఎస్బీఐ నిరాకరించింది. ఇది విశ్వసనీయ సమాచారం, వ్యక్తిగత వివరాలుగా పేర్కొన్నది. ఇప్పటికే ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో వివరాలు అందుబాటులో ఉండగా, విశ్వసనీయ సమాచారం అంటూ కారణం చూపి ఆర్టీఐ దరఖాస్తును తిరస్కరించటాన్ని సామాజిక కార్యకర్త లోకేశ్ బాత్ర తప్పుబట్టారు. ఈసీకి అందించిన సమస్త వివరాలు డిజిటల్ ఫార్మాట్‌లో ఇవ్వాలని కోరుతూ లోకేశ్ బాత్ర ఆర్టీఐ కింద ఎస్బీఐకి దరఖాస్తు చేయగా, ఎస్బీఐ తిరస్కరించింది.

వీసా స్పాన్సర్లపై యూకే కొత్త పరిమితులు

వార్షిక ఆదాయం 55 శాతం పెంపు

లండన్, ఏప్రిల్ 11: యూకేకు వచ్చే వారిని ఫ్యామిలీ వీసాపై స్పాన్సర్ చేసే బ్రిటన్ పౌరులు, నివాసితులపై ఆ దేశం పరిమితులు పెంచింది. భారతీయ వారసత్వంతో సహా కుటుంబ వీసాపై వారి బంధువులను స్పాన్సర్ చేయాలనుకునే వారికి అవసరమైన కనీస ఆదాయ నిబంధనను ప్రస్తుతాని కన్నా 55 శాతానికి పైగా పెంచింది. యూకేకు రావాలనుకునే వారిని స్పాన్సర్ చేసే బ్రిటన్ పౌరులు నివాసితుల వార్షిక ఆదాయం 29,000 జీబీపీలు ఉండాలి. అయితే దానిని ఇప్పుడు 38,700 జీబీపీలకు పెంచింది. టాక్స్ చెల్లింపుదారులకు భారం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రధాని రిషీ ఈ నిబంధన విధించినట్టు యూకే హోం సెక్రటరీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, దీనిని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

యూకే వీసా సోదాల్లో 12 మంది భారతీయుల అరెస్ట్

అక్రమ వలసలపై బ్రిటన్ ఉక్కుపాదం

లండన్, ఏప్రిల్ 11: బ్రిటన్‌లోని పరుపులు, కేక్ పరిశ్రమల్లో అక్రమంగా పని చేస్తున్న 12 మంది భారతీయులను ఆ దేశ ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. వెస్ట్ మిడ్‌ల్యాండ్స్ ప్రాంతంలో నిర్వహించిన సోదాల్లో వీరిని అరెస్ట్ చేసినట్టు యూకే హోం శాఖ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 'కేక్ ఫ్యాక్టరీలో అరెస్టయిన నలుగురు భారతీయులు వీసా నిబంధనలను ఉల్లంఘించారు. మొత్తం నిందితుల్లో నలుగురిని దేశం నుంచి బహిష్కరించడమా లేదా ఇండియాకు తిప్పి పంపడమా అనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మిగతా 8 మందికి క్రమం తప్పకుండా హోం శాఖ ఆఫీసులో రిపోర్ట్ చేయాలనే నిబంధన మీద బెయిల్ ఇచ్చాం' అని హోం శాఖ తెలిపింది. భారతీయులతో అక్రమంగా పని చేయించుకుంటున్న ఫ్యాక్టరీలకు జరిమానాలు విధిస్తామని అధికారులు తెలిపారు. చట్ట విరుద్ధంగా పని చేయడం స్థానిక సమాజాలకు హాని కలిగిస్తుందని.. తాజా అరెస్టులు ఫ్యాక్టరీ యజమానులకు హెచ్చరికలు పంపుతాయని అధికారులు తెలిపారు. అక్రమ వలసదారులను అరికట్టాలని సునాక్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలో విదేశీయులకు వీసా నిబంధనలు సైతం కఠినతరం చేశారు.

హిందువులు బౌద్ధంలోకి మారాలంటే అనుమతి తప్పనిసరి

జైన, సిక్కు మతం తీసుకునే వారికీ వర్తింపు

గుజరాత్ బీజేపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు

అహ్మదాబాద్, ఏప్రిల్ 11: మతమార్పిడులకు సంబంధించి గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. హిందూ మతం నుంచి బౌద్ధం, జైన, సిక్కు మతాలకు మారాలనుకుంటే గుజరాత్ మత స్వేచ్ఛ చట్టం – 2003 ప్రకారం జిల్లా మెజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నది. ఈ మేరకు ఏప్రిల్ 8న గుజరాత్ రాష్ట్ర హోంశాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. బౌద్ధం, జైన, సిక్కు మతాల్లోకి మారేందుకు దరఖాస్తులు వచ్చినప్పుడు ఆర్టికల్ 25(2) ప్రకారం ఈ మతాలు హిందూ మతంలోనే ఉన్నందున అనుమతి అవసరం లేదని పలువురు అధికారులు చెప్తున్నారని సర్క్యులర్‌లో పేర్కొన్నది. అయితే, గుజరాత్ మతస్వేచ్ఛ చట్టంలో బౌద్ధం ప్రత్యేక మతంగా ఉన్నందున ఈ చట్ట ప్రకారం హిందుత్వం నుంచి బౌద్ధం తీసుకునేందుకు నిర్దిష్ట ఫార్మాట్‌లో జిల్లా మెజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. సిక్కు, జైనమతాలకు మారే వారికి కూడా ఇది వర్తిస్తుందని పేర్కొన్నది.

బౌద్ధమతాన్ని స్వీకరిస్తున్న దళితులు

గుజరాత్‌లో కొంతమంది దళితులు బౌద్ధమతాన్ని స్వీకరిస్తున్నారు. పండుగల వేళ నిర్వహించే వేడుకల్లో మతాన్ని మార్చుకుంటున్నారు. గత ఏడాది అక్టోబరులో అహ్మదాబాద్‌లో ఒకేసారి 400 మంది బౌద్ధమతాన్ని స్వీకరించారు. 2022 అక్టోబరులోనూ గిర్ సోమ్‌నాథ్‌లో 900 మంది బౌద్ధం తీసుకున్నారు. గుజరాత్ బుద్ధిస్ట్ అకాడమీ(జీబీఏ)తో పాటు మరికొన్ని సంస్థలు మతమార్పిడి కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. కాగా, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను జీబీఏ కార్యదర్శి రమేశ్ బాంకర్ స్వాగతించారు. ఈ ఉత్తర్వుల ద్వారా బౌద్ధం ప్రత్యేక మతమని, హిందుత్వంతో సంబంధం లేదనే విషయం తేటతెల్లమైందని ఆయన వ్యాఖ్యానించారు.

రహస్యం తెలిసింది.. ఆ ఇద్దరికే!

పోలింగ్ నాడు పెట్టే బ్లూ ఇంక్ కథా కమామిషు ఇది

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): పోలింగ్ సమయంలో ఓటరు వేలిపై ప్రత్యేకమైన బ్లూ ఇంక్‌ను మార్క్‌గా వేస్తారు. రిగ్గింగ్ జరుగకుండా ఇదో ఏర్పాటు. ఇలా వేసిన ఇంక్ కొన్నిరోజులపాటు అలాగే ఉంటుంది. అయితే, ఈ ప్రత్యేక ఇంక్‌ను కర్ణాటకలోని మైసూరులో ఉన్న మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ (ఎంపీవీఎల్) కంపెనీలో మాత్రమే తయారు చేస్తారు. దీని తయారీ ఫార్ములా కూడా రహస్యమే. ఎంపీవీఎల్ డైరెక్టర్లకు కూడా ఈ ప్రత్యేక ఇంక్ తయారీ ఫార్ములా తెలియదు. ఎంపీవీఎల్ సంస్థలో పనిచేసే ఇద్దరు కెమిస్టులకు మాత్రమే ఇంక్ తయారీ విధానం గురించి తెలుసు. రిటైర్మెంట్ లేదా అనుకోని కారణాలు ఏర్పడితే, నమ్మకస్తులైన తమ తర్వాతి ఉద్యోగులకు ఈ ఫార్ములాను సదరు కెమిస్ట్‌లు బదిలీ చేస్తారట. కాగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం రూ. 55 కోట్ల విలువైన 26.55 లక్షల ఇంక్ వయల్స్‌ను వాడనున్నారు. ఈ మేరకు ఎంపీవీఎల్‌కు ఎన్నికల సంఘం తయారీ బాధ్యతలను అప్పగించింది.

చైనాతో సత్సంబంధాలు ఎంతో ముఖ్యం

'న్యూస్‌వీక్' ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్, చైనా దేశాల మధ్య స్థిరమైన, శాంతియుత సంబంధాలు ఏర్పడాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. భారత్, చైనా మధ్య సత్సంబంధాలు ఇరు దేశాలకే గాక, ప్రపంచానికి చాలా ముఖ్యమైనవని అన్నారు. 'న్యూస్‌వీక్' మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్–చైనా సరిహద్దు వివాదం వెంటనే కొలిక్కి రావాలన్నారు. ఇరు దేశాల మధ్య సానుకూలమైన దౌత్య, మిలటరీ స్థాయి చర్చలు జరుగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ వ్యాఖ్యలపై చైనా స్పందించింది. మోదీ వ్యాఖ్యలు ఇరు దేశాల సంబంధాలను బలోపేతం చేస్తున్నదని చైనా అధికార ప్రతినిధి మావో నింగ్ అన్నారు. బలమైన, స్థిరమైన సంబంధాలు ఇరు దేశాల ప్రయోజనాల్ని నెరవేర్చుతాయని ఆమె చెప్పారు. మరోవైపు, ప్రస్తుతం మన బలగాలు ఉగ్రవాదులను వారి సొంత దేశంలోనే మట్టుబెడుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు.

సోషల్ మత్తులో యువత చిత్తు

- స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాతో మానసిక అనారోగ్యం
- కౌమారదశలో ఉన్న వారిలోనూ తీవ్ర ప్రభావం
- అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్ అధ్యయనాల్లో వెల్లడి



లండన్, ఏప్రిల్ 11: సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం యువతలో మానసిక అనారోగ్యానికి కారణమవుతున్నదని అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లో జరిపిన పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ముఖ్యంగా కౌమారదశలో ఉన్న పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లు వాడటం, సోషల్ మీడియా యాప్‌లను వినియోగించడం వారి మానసిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని తేలింది. లండన్‌లోని కింగ్స్ కాలేజీ చేసిన ఒక అధ్యయనంలో బ్రిటన్‌లోని యువత మానసిక అనారోగ్యంతో సతమతమవుతున్నారని తేలింది. ఆస్ట్రేలియాలోనూ గత రెండు దశాబ్దాలుగా యువతలో మానసిక ఆందోళన పెరిగిపోతున్నదని మరో అధ్యయనంలో తేలింది. 16 ఏండ్ల నుంచి 24 ఏండ్ల మధ్య వయసు గల జనరేషన్ జెడ్‌గా పిలిచే యువతను పరిశీలించగా 40 శాతం మంది గత ఏడాదిలో ఒక్కసారైనా మానసిక సమస్యలను ఎదుర్కొన్నట్టు వెల్లడైంది. 11 నుంచి 14 ఏండ్ల మధ్య కౌమారదశలో ఉన్న 6,639 మంది పిల్లలను పరిశీలించగా 16 శాతం మంది ఆందోళన, 17 శాతం మంది నిరాశ, 14 శాతం మంది అధిక మానసిక క్షోభను అనుభవిస్తున్నట్టు తేలింది. 2022 నాటికే ఆస్ట్రేలియాలో పదేండ్ల వయసు వచ్చే నాటికి 93 శాతం మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లు వాడుతున్నట్టు లెక్కలు చెప్తున్నాయి. పిల్లల్లో మానసిక సమస్యలకు స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా ప్రధాన కారణంగా పరిశోధకులు భావిస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ వినియోగంపై పరిమితులు

ఎదిగే పిల్లలపై స్మార్ట్‌ఫోన్‌లు చూపిస్తున్న దుష్ప్రభావాలపై ఇప్పటికే ఐరాస హెచ్చరిస్తున్నది. పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్‌ల వినియోగాన్ని నిషేధించాలని సూచించింది. పిల్లల మానసిక ఆరోగ్యంపై స్మార్ట్‌ఫోన్‌లు చూపిస్తున్న ప్రభావాన్ని గుర్తించిన ఆస్ట్రేలియా ఇప్పుడు తరగతి గదుల్లో స్మార్ట్‌ఫోన్‌ల వాడకాన్ని నిషేధించింది. అమెరికాలోని ఫ్లోరిడాలోనూ 14 ఏండ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా చట్టం చేసింది. 14, 15 ఏండ్ల పిల్లలు వాడాలంటే తల్లిదండ్రుల అనుమతిని తప్పనిసరి చేసింది.

గురకపెట్టే వాళ్లకు బీపీ, డయాబెటిస్ ముప్పు!

న్యూఢిల్లీ: గురకపెట్టి నిద్రపోవటం సర్వసాధారణమైందిగా భావిస్తాం. కానీ బయటకు కనిపించని అనేక ఆరోగ్య సమస్యలకు ఇదొక సూచిక అని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరిస్తున్నది. బీపీ, డయాబెటిస్ సహా పలు ఆరోగ్య సమస్యలకు 'గురక'కు సంబంధముందని ఆఫ్రికా దేశాల్లో జరిపిన అధ్యయనంలో తేలింది. గురకపెట్టి నిద్రపోతున్న వాళ్ల డాటాను సేకరించిన పరిశోధకులు, గురకకు.. వివిధ అనారోగ్య సమస్యలకు ఉన్న సంబంధాన్ని కనుగొనేందుకు ప్రయత్నించారు. గురక పెట్టే వాళ్లకు బీపీ, డయాబెటిస్ ముప్పు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు.





సాయంత్రం వేళ వ్యాయామం ఉత్తమం

ఊబకాయం, మధుమేహులకు ఎంతో ప్రయోజనం

న్యూఢిల్లీ: సాయంత్రం వేళ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని సిడ్నీ యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా మధుమేహం, ఊబకాయంతో బాధపడుతున్న వారికి సాయంత్రం పూట చేసే వ్యాయామం చాలా మేలు చేస్తుందని తేలింది. 40 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న 30 వేల మందిపై ఎనిమిదేండ్ల పాటు చేసిన ఈ అధ్యయనం వివరాలు 'డయాబెటిస్ కేర్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి మధ్య వ్యాయామం, శారీరక శ్రమ చేసే వారిలో గుండెజబ్బులు, అకాల మరణ ముప్పు తక్కువగా ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఎలాంటి వ్యాయామం చేసినా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, వాకింగ్, రన్నింగ్, మెట్లు ఎక్కడం, ఇల్లు శుభ్రం చేయడం వంటివేవి చేసినా మేలేనని పరిశోధకులు పేర్కొన్నారు.